సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 15 । మార్చి । 2024



వస్తుసేవల్లో నాణ్యత తప్పనిసరి

వస్తుసేవల్లో నాణ్యత కొరవడినా.. నష్టపోయినా ఆధారాలతో ఫిర్యాదు చేసి పరిహారం పొందవచ్చు. నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కథనం..

IIలో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:27	శని: 5:02

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రిమ్స్‌లో కిడ్నీ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రి డయాలసిస్ కేంద్రంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్ మాట్లాడారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువ మంది కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. కలుషితనీరు, పెయిన్‌కిల్లర్లు మితిమీరి వాడితే కిడ్నీలు పాడయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. కిడ్నీ బాధితులు రిమ్స్‌లోని డయాలసిస్ సెంటర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డయాలసిస్ నోడల్ అధికారి డాక్టర్ తానాజీ, కేంద్రం ఇన్‌చార్జి ప్రేమ్‌దాస్, టెక్నీషియన్లు చరణ్, రామకృష్ణ, కార్తిక్, నవనీత్, సాయికిరణ్, ఫౌజియా, అర్షద్ తదితరులున్నారు.

యువకుడి రక్తదానం



రక్తదానం చేస్తున్న శివప్రసాద్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలం వాన్వట్ గ్రామానికి చెందిన కేమ మోహన్‌కు రక్తం అవసరమని వైద్యులు సూచించారు. స్పందించిన రెడ్డి ఐక్యవేదిక యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాతం శివప్రసాద్‌రెడ్డి గురువారం రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. రక్తదాతను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అభినందించారు.

నేటి నుంచి ఒంటిపూట

ఆదిలాబాద్‌టౌన్: వేసవి నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు శుక్రవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించాలని డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈనెల 18నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనుండగా పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం కొనసాగించాలని ఆదేశించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని డీఈవో ప్రణీత సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షలంటే భయం వద్దని తెలిపారు. ఒత్తిడిని జయించాలని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులతోపాటు జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 21వ తేదీన జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించనున్న మాదిగ, మాదిగ ఉపకులాల జిల్లా సదస్సు కరపత్రాన్ని గురువారం ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఆవిష్కరించారు. సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కదరపు ప్రవీణ్‌మాదిగ తెలిపారు. జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాల వారు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు సుంకే రమేశ్‌మాదిగ, పట్టణాధ్యక్షుడు దర్శనాల గంగన్నమాదిగ, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు నారపాక పరిమళ మాదిగ, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి నడికుంటి పెంటన్నమాదిగ, నాయకులు రాజుమాదిగ, శ్రీనివాస్‌మాదిగ తదితరులున్నారు.

ఆదిలాబాద్ పార్లమెంటరీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్



సక్కుకే ‘కారు’ టికెట్

- రాజధానిలో పార్లమెంటరీ సమావేశం
- అనంతరం ప్రకటించిన గులాబీ బాస్
- ఇక ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని పిలుపు
- గెలుస్తామని పార్టీ క్యాడర్‌కు భరోసా

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ లోకసభ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరు ఖరారైంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం పార్లమెంటరీ సమావేశం అనంతరం అభ్యర్థిని ప్రకటించారు. ముందునుంచీ పార్టీలో చర్చ సాగుతున్నట్లుగానే సక్కునే బరిలోకి దింపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సక్కుకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ టికెట్ దక్కలేదు. అధినేత కేసీఆర్ అప్పట్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో అప్పుడు ఆసిఫాబాద్ అభ్యర్థినిగా పోటీ చేసిన కోవ లక్ష్మికి సక్కు పూర్తి మద్దతు ఇచ్చి గెలుపులో ప్రధానపాత్ర వహించారు. దీంతో కేసీఆర్ ఇచ్చిన మాట నిలుపుకొంటూ సక్కును ఆదిలాబాద్ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రెండుసార్లు ఎమ్మెల్యేగా..

ఆత్రం సక్కు రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో మొదటిసారి, ఆ తర్వాత 2018లో మరోసారి హస్తం గుర్తుపై విజయం సాధించారు. రెండోసారి గెలుపొందిన తర్వాత ఆయన బీఆర్‌ఎస్‌లో చేరి కొనసాగుతున్నారు. కాగా, 2008లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మరుసటి ఏడాదే కాంగ్రెస్ అభ్యర్థిగా సక్కు ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాగా, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి 2014, 2019 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గోడం నగేశ్ బరిలో నిలిచారు. రెండు పర్యాయాల తర్వాత బీఆర్‌ఎస్ అధిష్టానం అభ్యర్థిని మార్చింది. ఈ స్థానం నుంచి 2008లో టీ మధుసూదన్‌రెడ్డి, 2014లో గోడం నగేశ్ బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా ఎంపికైన గోడం నగేశ్, ప్రస్తుతం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపికైన ఆత్రం సక్కు ఇరువురు గోండు సామాజిక వర్గానికి చెందినవారే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఎలా ఉంటుందనేదానిపై అందరి దృష్టి ఉంది.

సమావేశం తర్వాతే నిర్ణయం

బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ పార్లమెంటరీ సమావేశం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలు హాజరయ్యారు. సమావేశంలో అభ్యర్థి ఎంపికకు సంబంధించి ముఖ్యనేతలు కేసీఆర్ నిర్ణయానికే వదిలేశారు. ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కాగా, సాయంత్రం అభ్యర్థి ప్రకటన వెలువడింది.

మాజీ మంత్రి అల్లోల, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గైర్హాజరు

హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనేతలు, మాజీ మంత్రులు జోగు రామన్న, వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, రవీందర్‌రావు, వీ సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నేతలు భూక్యా జాన్సన్‌నాయక్, రమాదేవి, కిరణ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అయితే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సమావేశానికి గైర్హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరు పార్టీ మారుతున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సమావేశానికి రాకపోవడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. కాగా, ఇప్పటివరకు ఆదిలాబాద్ పార్లమెంట్‌లో గులాబీ పార్టీ బలంగా ఉన్నట్లు కేసీఆర్ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. గట్టిగా పోరాడితే ఈ స్థానం గెలుస్తామని భరోసా కల్పించారు.

ఆత్రం సక్కు బయోడేటా



పేరు : ఆత్రం సక్కు
తల్లిదండ్రులు : మాన్కుబాయి, రాజు
జననం : 2.1.1973
భార్య : తులసి (ప్రభుత్వ ఉపాధ్యాయురాలు–టీడబ్ల్యూపీఎస్)
కుమారులు : వినోద్, అంకిత్, అన్వేశ్
కూతుళ్లు : దివ్యభారతి, హిమబిందు, జంగుబాయి
వయస్సు : 51 సంవత్సరాలు
విద్యార్హత : ఇంటర్మీడియట్
కులం : ఎస్టీ (గోండు)
వృత్తి : వ్యవసాయం
చిరునామా : లక్ష్మీపూర్ గ్రామం, గిన్నెధరి గ్రామపంచాయతీ, తిర్యాణి మండలం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా.

క‘న్నీటి’ గోస తీరేనా?

- తాగునీటి పనులకు రూ.6.57 కోట్లు
- మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- జీపీ తీర్మానాల సేకరణలో అధికారులు
- త్వరగా పనులు పూర్తయితేనే తాగునీరు



మండలాలవారీగా మంజూరైన పనులు, కేటాయించిన నిధుల వివరాలు

మండలం	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
ఆదిలాబాద్	10	44.50
జైనథ్	17	35.00
బేల	13	40.10
మావల	1	15.00
బజార్‌హత్నూర్	6	6.61
భీంపూర్	11	8.67
బోథ్	7	8.50
గుడిహత్నూర్	11	18.82
ఇచ్చోడ	8	11.00
నేరడిగొండ	12	13.35
సిరికొండ (బీ)	4	06.00
తలమడుగు	11	12.55
తాంసి	9	12.50
ఇంద్రవెల్లి	31	96.00
సిరికొండ (కే)	22	49.50
ఉట్నూర్	48	96.00
నార్నూర్	41	78.00
గాదిగూడ	30	105.20

కైలాస్‌నగర్: ఎమ్మెల్యేలకు కేటాయించిన రూ.10కోట్ల శాసనసభ నియోజకవర్గ (ఏసీడీపీ) నిధుల్లో రూ.కోటి తప్పనిసరిగా తాగునీటికి వెచ్చించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఇందుకు అనుగుణంగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలోగల గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించే దిశగా దృష్టి సారించారు. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ద్వారా కలెక్టర్‌కు పంపించారు. ఈ మేరకు వాటికి కలెక్టర్ ఆమోద ముద్ర వేస్తూ మంజూరు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో త్వరలోనే పనులు ప్రారంభం కానుండగా, సకాలంలో పూర్తయి తాగునీరు అందిస్తేనే ప్రజల సమస్య తీరనుంది.

రూ.6.57కోట్లు.. 292 పనులు

ఏసీడీపీ నిధులతో ఆయా నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లో కొత్త పైపులైన్ల ఏర్పాటు, మరమ్మతులు, నల్లా కనెక్షన్లు, మోటార్, బోరుబావుల మరమ్మతులు చేపట్టనున్నారు. జిల్లాలోని బోథ్, ఆదిలాబాద్ పూర్తిస్థాయి నియోజకవర్గాలతో పాటు ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజవర్గాల్లోని ఐదు మండలాల పరిధిలో వేసవిలో ఎండలు ముదరకముందే తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టనుండగా, గ్రామపంచాయతీల నుంచి తీర్మానాలు సేకరిస్తున్నారు. త్వరలో పనులు కూడా ప్రారంభించనున్నారు.

అత్యధికంగా ఖానాపూర్‌లోనే..

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జిల్లా పరిధిలోకి వచ్చే మూడు మండలాల్లో అత్యధికంగా రూ.2.41 కోట్లతో కూడిన 101 పనులకు ప్రతిపాదనలు అందించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా పరిధిలోకి వచ్చే రెండు మండలాల్లో రూ.1.83 కోట్లతో కూడిన 71 పనులు ప్రతిపాదించారు. ఇక ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నాలుగు మండలాల్లో రూ.1.34 కోట్ల కూడిన 41 పనులు చేపట్టేలా ప్రతిపాదనలు అందజేశారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల పరిధిలో రూ.98లక్షలతో కూడిన 79 పనులకు ప్రతిపాదనలు అందించారు. పనులు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఏజెన్సీ పరిధిలోని గాదిగూడ, నార్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, సిరికొండ మండలాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారు.

త్వరలో పనులు ప్రారంభం

అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టాల్సిన తాగునీటి పనులకు సంబంధించి ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు అందించారు. ఏ మండలంలో ఏయే పనులు చేపట్టాలనే వివరాలతో కూడిన ప్రతిపాదనలు ఇవ్వగా వాటికి కలెక్టర్ మంజూరు ఇచ్చారు. ప్రస్తుతం గ్రామపంచాయతీల నుంచి తీర్మానాలు తీసుకుంటున్నాం. త్వరలో పనులు ప్రారంభించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం. – చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఆదిలాబాద్

నేడు ఉమ్మడి జిల్లా అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటన షెడ్యూల్ వివరాలను కలెక్టర్ రాజర్షి షా గురువారం ప్రకటించారు. శుక్రవారం ఉదయం 10గంటలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ నుంచి మంత్రి బయలుదేరి 11.30గంటలకు ఉట్నూర్ డివిజన్ కేంద్రానికి చేరుకుంటారు. 12.30గంటల వరకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. భోజన విరామ అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని పీఎమ్మార్సీ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- ఇంటిబాట పట్టిన విద్యార్థులు



పరీక్షలు ముగిసిన సంబురంలో విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: గత నెల 28వ తేదీన జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాల్లో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కాగా, జైనథ్ మండలం మాంగుర్లకు చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడగా, మరో ఇద్దరు, ముగ్గురు ‘నిమిషం’ నిబంధనతో పరీక్షలకు దూరమయ్యారు. గురువారం చివరిరోజు పరీక్షకు 8,717 మందికి 7,892 మంది హాజరు కాగా, 825 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షలు రాసి బయటకు వచ్చిన తర్వాత విద్యార్థులు ఆనందంలో మునిగితేలారు. ఒకరికొకరు ఆటోగ్రాఫ్‌లు, ఫోన్ నంబర్లు తీసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని వసతిగృహాలు, అద్దె గదుల నుంచి ఇంటిబాట పట్టారు. దీంతో బస్టాండ్ ప్రాంతం విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారింది. మరికొందరు నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలు రాసేందుకు, కంప్యూటర్ శిక్షణ పొందేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు ఇంటర్ పరీక్షాకేంద్రాల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. తమ కళాశాలలో చేరాలని కోరారు. ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన, వసతులున్నట్లు ప్రిన్సిపల్ జలగం అనిత విద్యార్థులకు వివరించారు. కాగా, ఈనెల 16వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మూల్యాంకనం జరగనుండగా, ఇందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే వివిధ జిల్లాలకు చెందిన జవాబు పత్రాలు చేరాయి.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని టీటీడీసీ, సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ రాజర్షిషా గురువారం ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూంలలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పలు సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నలంద ప్రియా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో గురువారం వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రిమ్స్ మానసిక నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఓంప్రకాశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పరీక్షలు జీవితంలో ఒక భాగమని, ఫెయిలైతే జీవితం ఆగిపోదని సూచించారు. ఎంతోమంది పరీక్షల్లో తప్పినవారు ఉన్నతస్థాయిలో ఉన్నారని తెలిపారు. ఆత్మస్థైర్యం కోల్పోయి అఘాయిత్యాలకు పాల్పడవద్దని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు పిల్లలను ఒత్తిడికి గురిచేయవద్దని సూచించారు. జూమ్ మీటింగ్‌లో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్‌పెల్లివార్, సోషల్ వర్కర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేపు పిప్రికి ఉపముఖ్యమంత్రి ‘భట్టి’ రాక



సభాస్థలిని పరిశీలిస్తున్న సాయన్న

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామానికి ఈ నెల 16వ తేదీన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నట్లు డీఆర్డీవో సాయన్న తెలిపారు. గురువారం పిప్రి గ్రామంలో సభాస్థలిని పరిశీలించారు. గతేడాది మార్చి 16వ తేదీన భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచే పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ప్రారంభించారు. అప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకుని పలు హామీలిచ్చారు. వాటిని అమలు చేయడంలో భాగంగా గ్రామానికి రానున్నారు. గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభం, మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి ఉండగా సాయన్న ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన వెంట బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బోథ్ సీఐ రమేశ్, జెడ్పీటీసీ సభ్యుడు మల్లెపూల నర్సయ్య, డీఎల్పీవో ఫణిందర్ రావ్, బోథ్ ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై నరేశ్, ఏపీవో శ్రీనివాస్, అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, మహమూద్‌ఖాన్, పసుల చంటి, బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

కైలాస్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు జాబితా, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా సహకరించాలని కోరారు. ఒక్కో పోలింగ్ సెంటర్‌లో గతంలో 1,500 మంది ఓటర్లుండగా, ప్రస్తుతం 1,600కు పెంచినట్లు తెలిపారు. 85 ఏళ్లు నిండినవారు, దివ్యాంగులు ఇంటివద్దే ఓటు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇందుకు పోస్టల్ బ్యాలెట్ కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఎదులాపురం: పంటలకు కనీస మద్దతు ధరతో పాటు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఉమ్మడి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పాలిట శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలను అదుపు చేయాలని, జాతీయ నూతన విద్యా విధానం 2020ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నాయకులు గొరాల సుభాష్, నర్సింగ్, దేవిదాస్, ఎర్రాజి హరీశ్, మడావి గణేశ్, దుర్గం కళావతి, పూజ, దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్ ఆశయాలు సాధించాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: కారల్‌మార్క్స్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కారల్ మార్క్స్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ‘ప్రపంచ కార్మికులారా.. ఏకం కండి.. పోరాడితే పోయేదేమీలేదు బానిస సంకెళ్లు తప్పా..’ అంటూ 150 ఏళ్ల కిందటే ఎలుగెత్తి చాటిన కార్మికవర్గ వజ్రాయుధం కారల్‌మార్క్స్ అని కొనియాడారు. నాయకులు బండి దత్తాత్రి, ఆర్.మంజుల, ఎం.గంగన్న, ఆత్రం కిష్టన్న, అగ్గిమల్ల స్వామి, పొచ్చన్న, రమాకాంత్, రమేశ్, దేవిదాస్, హరిషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు



రికార్డు ప్రతిని అందిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన అభిలాష్–పూజ దంపతుల కుమారుడు కశ్విక్ ఎనిమిది నెలల వయసులో బాల మేధావిగా అబ్బురపరుస్తున్నాడు. తన తల్లి పూజ పేర్లు చెప్పిన 300 వస్తువులను గుర్తించి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుకు సైతం దరఖాస్తు చేసుకోగా త్వరలోనే నిర్వాహకుల నుంచి రికార్డ్ పత్రం రానున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతిని బాలుని తల్లిదండ్రులకు అందించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యాపల్‌గూడ సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడింది. మత్తడిగూడకు చెందిన ఆటోడ్రైవర్ రాంషావ్ పలువురు ప్రయాణికులను ఎక్కించుకుని బంగారుగూడ నుంచి మత్తడిగూడకు బయలుదేరాడు. యాపల్‌గూడ సమీపంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇంతియాజ్‌కు తీవ్రంగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతియాజ్ ఖానం కూతురు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారుతో ఎస్సై

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామంలో అక్రమంగా దేశీదారు అమ్ముతున్న వ్యక్తిని గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన అమీర్‌రావు కొంతకాలంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు గురువారం రాత్రి పోలీసులు దుకాణంలో దాడి చేసి 21 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఎక్సైజ్ శాఖ అధికారులకు కేసు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



చింతల్‌చాందలో పట్టుకున్న ట్రాక్టర్

లక్ష్మణచాంద: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చాంతల్‌చాంద గోదావరి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్ యజమాని నాగన్నపై కేసు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిర్మల్ : సారంగాపూర్ మండలం మలక్‌చించోలి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వస్తుసేవల్లో నాణ్యత తప్పనిసరి

వస్తు వినిమయ వ్యవస్థలో వినియోగదారుడికే సర్వహక్కులు ఉంటాయి. కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారుడికి ఉంది. కానీ ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువయ్యాయి. తూనికలు, కొలతల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగడం లేదు. వస్తుసేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా.. ఆధారాలతో ఫిర్యాదుచేస్తే తగిన పరిహారం పొందవచ్చు. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..



జిల్లా కేంద్రంలోని ఓ మాల్‌లో నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

- వస్తువు తయారీలో ప్రమాణాలు పాటించాల్సిందే
- కొనుగోలు సమయంలో అప్రమత్తత అవసరం
- ఫిర్యాదుల కోసం వినియోగదారుల ఫోరమ్
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా/పాతమంచిర్యాల: 1983 నుంచి ఏటా మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. మనదేశంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు 1986లో రూపొందించిన చట్టం డిసెంబర్ 24, 1987 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. 2019 చట్టంతో దాన్ని మరింత పటిష్ట పరిచారు. కేంద్ర రక్షణ ప్రాధికార సంస్థ కూడా 2020లో ఏర్పాటైంది. వినియోగదారుల సౌలభ్యం కోసం వివిధ స్థాయిలో కమిషన్లు ఏర్పాట్లు చేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్లు పని చేస్తున్నాయి.

చట్టంలోని అంశాలు ఇవీ...

భారత ప్రభుత్వం 1986లో వినియోగదారుల రక్షణకు ఒక విప్లవాత్మకమైన చట్టాన్ని తెచ్చింది. అదే వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం 'రీడ్రసల్ ఫోరమ్స్'ను ప్రతీ జిల్లా కేంద్రంలోను ఏర్పాటు చేశారు. ఇవి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి ఫోరమ్స్‌గా విభజించారు. జిల్లా స్థాయి కేంద్రానికి రిటైర్డ్ జిల్లా జడ్జి అధ్యక్షుడిగా, మరో ఇద్దరు మెంటర్లుగా ఉంటారు. మెజారిటీ కమిటీ సభ్యుల ఆమోదంతో ఫోరంలోని కేసులపై తీర్పు ఇస్తారు. వస్తువు లేదా సేవ విలువ, కోరే నష్ట పరిహారం రూ.లక్ష వరకు అయితే కోర్టు ఫీజు రూ.100, రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రూ.200, రూ.10 లక్షల వరకు రూ.400, రూ.10 లక్షల పైన అయితే రూ.500 నామమాత్రపు కోర్టు ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత ఫిర్యాదుదారుడు, ప్రతివాదుల మధ్యవర్తిత్వం నడిపి పరిష్కరించడానికి కృషి చేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇది అందుబాటులో ఉంది. జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పును 45 రోజుల లోపల రాష్ట్ర కమిషన్‌కు అప్పీలు చేసుకోవచ్చు. జిల్లా కమిషన్ తీర్పును అనుసరించి వ్యాపారి, విక్రయదారుల ఆస్తులు జప్తు చేసే అధికారం ఉంటుంది. వస్తువులను అమ్మినవారు, డీలర్, ఉత్పత్తిదారులు ఇందులో బాధ్యులవుతారు.

కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వినియోగదారుల కమిషన్ తోడుగా కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ చట్టంలో ఉన్న ముఖ్యమైన భాగం ఆన్‌లైన్, ఈ మెయిల్ ద్వారా, రాతపూర్వకంగా నేరుగా సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు. పరిష్కరించిన కేసును జాతీయ కమిషన్‌లో మాత్రమే అప్పీల్‌కు అవకాశం ఉంటుంది. టోల్‌ఫ్రీ నంబర్ 18004250626 లేదా ఉమ్మడి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదిలాబాద్ కార్యాలయం, 08732-22078లో సంప్రదించవచ్చు .

ఫిర్యాదు ఎప్పుడు చేయాలంటే?

ఒక వ్యాపారి, డీలర్ ద్వారా గానీ వినియోగదారుడు నష్టపోయి ఉంటే సదరు వ్యక్తిపై లేదా సంస్థపై ఫిర్యాదు చేయవచ్చు. వస్తువులో లేదా ప్రొడక్ట్ ఒకటి అంతకంటే ఎక్కువ లోపాలు ఉన్నప్పుడు సర్వీసు విషయంలో డీలర్ అశ్రద్ధ చేసేటప్పుడు, అసలు ధర కంటే ఎక్కువ వసూలు చేసినప్పుడు, ఇతర విధంగా నష్టపోయినా ఫిర్యాదు చేయవచ్చు.

హక్కుల గురించి తెలుసుకోవాలి



వినియోగదారుడు వస్తువును కొనుగోలు చేసే ముందు నాణ్యతను పరిశీలించాలి. తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. నాసిరకం వస్తువులపై, మోసపూరిత వ్యాపారులపై వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడానికి వెనుకాడవద్దు. ప్రతిఒక్కరూ తమకున్న హక్కుల గురించి తెలుసుకోవాలి. మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి. ఉమ్మడి జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరం ఉంది. నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా కేంద్రాల్లో కూడా ఏర్పాటుచేస్తే సత్వర న్యాయం మరింత అందుబాటులోకి లభిస్తుంది.

– సింగరి లింగయ్య, న్యాయవాది, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, నిర్మల్

పోస్టల్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పోస్టల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: రైతుల డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకున్న పోస్టల్ అధికారి జాదవ్ విజయ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జాదవ్ విజయ్ కుమార్ రైతుల ఖాతాల నుంచి డబ్బులను తన ఖాతాలోకి జమ చేసుకున్నారని రైతులు గురువారం నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ విషయమై పోస్టల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సదరు మేనేజర్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అధైర్య పడవద్దని, డబ్బులు రికవరీ అయ్యేంత వరకు వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. శుక్రవారం పోస్టల్ అధికారుల బృందం విచారణకు రానున్నట్లు తెలి పారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి లక్కీడ్రా

ఉట్నూర్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి గానూ హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతపూర్ పబ్లిక్‌స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీడీ దిలీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పీవో ఖుష్బూ గుప్తా, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

15 మంది సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: మల్టీజోన్–1 పరిధిలో పని చేస్తున్న 15మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఐజీ రంగనాథ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీఐలు ఉన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఐ.సైదారావ్	వెయిటింగ్ మల్టీ జోన్–1	ఖానాపూర్
డీ. మోహన్	ఖానాపూర్	శ్రీరాంపూర్
టీ.బన్సీలాల్	శ్రీరాంపూర్	మంచిర్యాల
ఎస్‌పీ.రవీందర్	మంచిర్యాల	సీసీఎస్ కరీంనగర్
పీ.ప్రసాద్	వెయిటింగ్ మల్టీజోన్–1	డీసీఆర్‌బీ ఆదిలాబాద్
సీహెచ్.నటేష్	డీసీఆర్‌బీ ఆదిలాబాద్	మల్టీజోన్–1 కార్యాలయం



వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తలమడుగు(బోథ్): మండలంలోని బరంపూర్ గ్రామ సమీపంలోని కొండపైన తెలంగాణ తిరుపతిగా పిలిచే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గోపాలకృష్ణ మఠాధిపతి స్వామి యోగానంద సరస్వతి, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండపై నుంచి గ్రామ పురవీధుల గుండా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ దామోదర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదేరేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేశ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న చిట్యాల సుహాసిని

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలో ఈ నెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వంగ విష్ణువర్ధన్ తెలిపారు. గుడిహత్నూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన భరత్ (23), శీను, కైలాస్ ద్విచక్ర వాహనంపై సీతగొంది వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వస్తుండగా మావల గ్రామంలో ఎస్‌ఆర్ ప్రైమ్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు మార్గం సమీపంలో టిప్పర్‌ను ఢీకొట్టడంతో భరత్‌కు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తండ్రి నాగోరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను మోసగించిన వ్యక్తికి ఏడాది జైలు

ఖానాపూర్: మహిళను మోసగించిన కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియనాయక్ తెలిపారు. మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన శ్యామలను జగిత్యాల జిల్లా కోతపూర్ గ్రామానికి చెందిన తాల్లపెల్లి రాజేశ్యామ్ 2018లో పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడు. దీనిపై బాధితురాలు ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై వినయ్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కందకాల పరిరక్షణ దిశగా..

- గజ్‌గఢ్ వద్ద ఆక్రమణలపై కదలిక



ట్రెంచ్ కొట్టిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్: కందకాలు ఖతం.. అంటూ చరిత్ర కందకాలు, కట్టడాల కబ్జాలపై పలుమార్లు 'సాక్షి' కథనాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చింది. ఈక్రమంలో రెండు నెలల క్రితమే కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. జిల్లాలో చెరువులు, జలవనరుల పరిరక్షణ కోసం లేక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రతినెలా సమావేశమవుతూ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటోంది.

గజ్‌గఢ్ కందకం రక్షణకు..

ప్రియదర్శినినగర్‌లో ఎస్‌ఆర్ .డీజీ స్కూల్ వెనుకగల గజ్‌గఢ్ కందకం మొత్తాన్ని మూసివేసి ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. దీనిపై జనవరి 24నే 'కందకం ఖతం..' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం గజ్‌గఢ్ చుట్టూ ఉన్న కందకాన్ని కాపాడే దిశగా చుట్టూ ట్రెంచ్ కొట్టించారు. ఇందులో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. చెరువులు, జలవనరుల పరిరక్షణ కోసం లేక్ కమిటీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

'పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉందాం'



రాథోడ్ రమేశ్, మాజీ ఎంపీ

ఖానాపూర్: ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై పార్టీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉందామని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందని తెలిపారు. కొద్దిపాటి తేడాతో తాను ఓడిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ కుటుంబ సభ్యులుగా ఈసారి సమష్టిగా ఆదిలాబాద్ ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్దామన్నారు. పార్టీ శ్రేణులెవరూ నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దన్నారు. పార్టీ కార్యకర్తలే తన బలం బలగం అని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా తాను అందరికీ అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఢిల్లీ సదస్సులో ట్రిపుల్‌ఐటీ వీసీ



మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

భైంసా: న్యూఢిల్లీలో ఇండియా డిడిక్టిక్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఎమర్జింగ్ బిగ్‌సిట్ భారత్ 2047 ఉన్నత విద్యావిధాన మార్పిడి సదస్సులో ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల మేధావులను, ఆచార్యులను ఒకేచోట ఉంచి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఎడ్యుకేషనల్ పాలసీల గూర్చి ఈ సమావేశంలో చర్చించారు. ఇలాంటి సదస్సులతో ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు.

కరువు భత్యం అమలు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఏప్రిల్ నుంచి బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న కోరారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్నిరకాల కేటగిరీల, కార్మికులు, బీడీ ప్యాకర్స్ బీడీ చాటర్స్ గంపవాలా, బట్టి వాలా కార్మికులందరికీ ఏప్రిల్ 1 నుంచి కరువు భత్యం అమలు చేయాలని జిల్లా కేంద్రంలో కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన కరువు భత్యం తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు వర్తి స్తుందని తెలిపారు. దీనిని వెంటనే అమలు చేయాలని బీడీ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. కొన్ని బీడీ యాజమాన్యాలు పెరిగిన కరువు భత్యాన్ని కార్మికులకు అమలు చేయకుండా కుట్రలు చేసే విధానాన్ని మార్చుకోవాలన్నారు. కార్మికుల పొట్టకొడితే యాజమాన్యాలు తీవ్ర పరిణామాలు చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 16 కా ర్పొరేషన్లు ఏర్పాటుకే కేబినెట్ నిర్ణయించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. గురువారం మాట్లాడుతూ కులవృత్తులు, వివిధ కులాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ నిర్ణయం గొప్ప పరిణామమన్నారు. సా మాజికవర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయ డం ద్వారా సమాజంలో అణగారిన వర్గాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగమేనని పేర్కొన్నారు. ఆదివాసీ కార్పొరేషన్ తోపాటు లంబా డా కార్పొరేషన్లు సైతం ఏర్పాటు చేయడాన్ని గిరిజన విభాగం ద్వారా స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు తీసుకోవడం గొప్ప విషయమని అన్నారు.

పరుచుకున్న ఆహ్లాదం



వేసవికాలం ప్రారంభమైంది. మార్చి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత మొదలైంది. వేడి నుంచి ఉపశమనం కోసం చెట్టునీడను ఆశ్రయించే కాలమిది. నిర్మల్ నుంచి భైంసా మార్గంలో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ నుండి లోలం వరకు ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డుపై వెళ్లే వారికి నీడనిస్తూ సేదతీరుస్తున్నాయి. మండు వేసవిలో పచ్చనిచెట్ల మధ్య ప్రయాణం మనసుకు ఆహ్లాదం కలిగిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్‌ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్‌రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివిధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోస్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

'కడెం'ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు

- ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడ్మ బొజ్జుపటేల్
- ప్రాజెక్టుకు మరమ్మతు పనులు ప్రారంభం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



వరద గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కీలక ప్రాజెక్టు అయిన కడెంను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.5.46 కోట్లు మంజూరు చేసి ప్రాజెక్టుకు మరమ్మతులు చేయిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతు పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన కడెం ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కు చెదరలేదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని అన్నారు. ప్రాజెక్టు నిర్వహణను కూడా బీఆర్ఎస్ సర్కార్ గాలికి వదిలేసిందని ఆరోపించారు. దీని ఫలితంగా ప్రాజెక్టు ఆయకట్టు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రాజెక్టు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కడెం ఆయకట్టు రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కడెం ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మాణం, 25 గేట్లతో కడెం ప్రాజెక్టు పునర్నిర్మాణం అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అలెగ్జాండర్, ఈఈ విఠల్, డీఈ బోజదాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, మండలాధ్యక్షుడు మల్లేశ్, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, భూమేశ్, వెంకటేశ్, సాగర్, సత్తెన్న, రఫీక్, సత్యంచారి, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

చెట్లపొదల్లో నవజాత శిశువు

- ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని శివారులో ఘటన
- శిశుగృహకు తరలించిన అధికారులు




పంటచేనులో శిశువు



శిశుగృహ సిబ్బందికి అప్పగిస్తున్న అధికారులు

తాంసి: నవజాత శిశువును ఎవరో పంటచేనులో వదిలివెళ్లిన అమానవీయ ఘటన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం వేకువజామున 5గంటలకు నిపాని గ్రామానికి చెందిన గంగమ్మ సమీపంలోని పంటచేను వద్దకు బహిర్భూమికి వెళ్లగా పసికందు ఏడుపు వినిపించింది. వెంటనే ఆమె పొదల్లో పడి ఉన్న మగశిశువును గుర్తించింది. ఆమె సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న గ్రామస్తులు శిశువును అక్కున చేర్చుకున్నారు. గ్రామంలోకి తీసుకువెళ్లి స్నానం చేయించి పాలు పట్టారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ప్రదీప్‌కుమార్ గ్రామానికి చేరుకున్నారు. శిశువును మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం అంబులెన్స్‌లో తరలించి శిశుగృహ అధికారులకు అప్పగించారు. కాగా, మహారాష్ట్ర నుంచి అంతర్రాష్ట్ర రహదారిపై వెళ్లేవారెవరైనా శిశువును వదిలి వెళ్లి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. కాగా, శిశువు లభించిన స్థానంలో మహిళ ప్రసవించిన ఆనవాళ్లు ఉన్నాయి.

జీడీకే-5 ఓసీపీకి మరో 30 ఏళ్ల భవిష్యత్!



జీడీకే-5 ఓసీపీ



బెల్ట్‌ద్వారా బయటకు వస్తున్న బొగ్గు

- పంచ్‌ఎంట్రీ తరహాలో ఓసీపీ
- ప్రస్తుత ఓసీపీకి తగ్గిన జీవితకాలం
- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న యాజమాన్యం

ప్రతిపాదిత ప్రాజెక్టు పేరు: పంచ్‌ఎంట్రీ
టెక్నాలజీ : కంటిన్యూస్ మైనర్
జీవితకాలం: సుమారు 30 ఏళ్లు
బొగ్గు నిల్వలు: 40 మిలియన్ టన్నులు
ఏటా ఉత్పత్తి: ఒక మిలియన్ టన్ను
అంచనా వ్యయం: రూ.150 కోట్లు

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో బొగ్గునిల్వలు అడుగంటిపోతున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వెళ్తున్న యాజమాన్యం దానికి తగ్గట్టుగా విస్తరణ లేకపోవడంతో గనుల మూసివేతకు దారి తీస్తోంది. ఇటీవలే గోదావరిఖని సమీపంలో ఏర్పాటైన జీడీకే-5ఓసీపీ పరిస్థితి అలాగే తయారైంది. మరో 8ఏళ్లలో బొగ్గు నిల్వలు పూర్తయి కాలగర్భంలో కలిసిపోనుంది. వాస్తవానికి 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఏటా వార్షిక లక్ష్యాలు పెంచుకుంటూ వెళ్తుండటంతో బొగ్గు నిల్వలు అడుగంటిపోతున్నాయి. నాలుగేళ్ల ముందుగానే ఈ ప్రాజెక్టులో బొగ్గు నిల్వలు పూర్తికానున్నాయి. ఈక్రమంలో ఈప్రాంతంలో బొగ్గుగని జీవితకాలం పెంచేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జీడీకే–5 ఓసీపీ క్వారీలో 300 మీటర్ల లోతులో పంచ్‌ఎంట్రీ ఏర్పాటు చేసి 600 మీటర్ల లోతు వరకు ఉన్న బొగ్గును వెలికితీసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో భూమిపొరల్లో ఉన్న బొగ్గును వెలికితీయడం ప్రారంభిస్తే జీడీకే–5 ఓసీపీకి మరో 30ఏళ్ల భవిష్యత్ ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిదేళ్ల జీవిత కాలంతో పాటు మరో 30 ఏళ్లు కలిస్తే 38 ఏళ్లపాటు ఈ ప్రాజెక్టు ఢోకా ఉండబోదని నిపుణులు చెబుతున్నారు.

డిమాండ్ పెరగడంతో..

గోదావరిఖని సమీపంలో 14ఏళ్ల జీవిత కాలం లక్ష్యంగా జీడీకే–5 ఓసీపీని భూగర్భగనుల స్థానంలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపాదనలు రూపొందించిన సమయంలో ఉత్పత్తి లక్ష్యం తక్కువగా కేటాయించినప్పటికీ విద్యుత్‌సంస్థల నుంచి డిమాండ్ పెరుగుతుండటంతో వార్షిక లక్ష్యాలను అనూహ్యంగా పెంచారు. దీంతో జీవిత కాలం పదేళ్లకే పరిమితం అయ్యింది. ఆ తర్వాత ఓసీపీ మూసివేసే పరిస్థితి ఏర్పడింది.

పంచ్‌ఎంట్రీ పేరుతో కొత్త గని

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు తరహాలో పంచ్ ఎంట్రీ ద్వారా భూగర్భగని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు మొదలయ్యాయి. ఓసీపీ లోపల 300 మీటర్ల లోతులో ఐదు సొరంగాలు ఏర్పాటు చేసి అక్కడ నుంచి 600మీటర్ల లోతువరకు బొగ్గును వెలికితీయాలనే ఆలోచనలో ఉన్నారు. ఇది ఆచరణ రూపం దాల్చితే మరో 30ఏళ్ల భవిష్యత్ పెరగనుంది. ప్రాథమికంగా దీనిపై నివేదికలు ఉన్నతస్థాయికి వెళ్లినట్లు తెలుస్తోంది. రామగుండం రీజియన్‌లో భూగర్భగనులు రోజురోజుకు తగ్గిపోతుండటం, పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు తగ్గుతున్న క్రమంలో యాజమాన్యం తీసుకునే ఈనిర్ణయంతో మరో 30 ఏళ్ల భవిష్యత్ ఉండనుంది.

రిమ్స్‌లో ముక్కు మూసుకోవాల్సిందే..











ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పలు వార్డుల్లో చెత్తాచెదారం రోజుల తరబడి పేరుకుపోతోంది. పైగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నేడు 'షరతులు వర్తిస్తాయి' విడుదల

- సినిమా దర్శకుడు గోదావరిఖనివాసి





సినిమా పోస్టర్, చిత్ర నటులతో దర్శకుడు కుమారస్వామి (మధ్యలో)

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ యాస, భాష ఎంచుకొని, మధ్యతరగతి మనుషుల జీవితాలను, తాను పడిన, చూసిన కష్టనష్టాలను, సంతోషాలను ఇతివృత్తంగా గోదావరిఖనికి చెందిన రచయిత, దర్శకుడు కుమారస్వామి(అక్షరకుమార్) స్టార్ లైట్ స్టూడియో బ్యానర్‌లో 'షరతులు వర్తిసాయి' అనే చిత్రాన్ని తెరకెక్కించాడు. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. చిత్రీకరణ హీరో, హీరోయిన్‌ల ఇళ్లున్న కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో, చల్మెడ ఆనందరావు ఆస్పత్రి, ఎల్ఎండీ కాలనీ, శుభమంగళ ఫంక్షన్‌హాల్, వివేకానంద హైస్కూల్, భాగవతి స్కూల్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో జరిగింది. ఇది ఆద్యంతం విజ్ఞానం, వినోదం పంచే సినిమాగా నిలుస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది.

మంచి సినిమా.. ఆదరించండి

కరీంనగర్ ఎన్నో ఉద్యమాలకు, త్యాగాలకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. షరతులు వర్తిస్తాయి సినిమా మీ సమయాన్ని, డబ్బును వృథా చేయదు. ఇది సామాన్యుల బతుకు చిత్రం. మంచి సినిమా.. ప్రేక్షకులు ఆదరించాలి. తెలంగాణ సినిమాను నిలబెట్టాలి.

– కుమారస్వామి, రచయిత, దర్శకుడు

వృద్ధురాలి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం: మాయమాటలు చెప్పి, గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధురాలి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కరీంనగర్ టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని సప్తగిరికాలనీకి చెందిన గంగిపెల్లి బాలయ్య మంకమ్మతోటలో ఇస్త్రీ షాప్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఆయనకు భోజనం ఇవ్వడానికి భార్య శంకరమ్మ వెళ్తోంది. దారిలో ఇద్దరు యువకులు కలిసి.. పోలీసులు తనిఖీ చేసి, బంగారం తీసుకుంటున్నారని, తమకు ఇస్తే వారిని దాటగానే ఇచ్చేస్తామని నమ్మించారు. దీంతో ఆమె తన వద్ద ఉన్న రూ.90 వేల విలువైన పుస్తెల తాడు, ఉంగరం ఇచ్చేసింది. వారు వెంటనే బైక్‌పై పారిపోయారు. తర్వాత దొంగలని గుర్తించిన శంకరమ్మ అరవడంతో స్థానికులు వచ్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తూ కనిపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.